క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

మల్హర్: మండలంలోని తాడిచర్ల పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం పీఏసీఎస్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ సంతోష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 11:30 గంటలకు సొసైటీ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీఆర్పీఎఫ్ జవాన్ల శ్రమదానం



కాటారం: స్వచ్ఛతా హీ సేవ (సత్యాగ్రహం నుంచి స్వచ్ఛతా కార్యక్రమం వైపు) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాటారంలో 58వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ జవాన్లు శ్రమదానం చేపట్టారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ, ప్రైమరీ పాఠశాల ఆవరణలోని చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. విద్యార్థులతో కలిసి పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ గూర్చి జవాన్లు ప్లకార్డులు ప్రదర్శించారు. పరిసరాల పరిశుభ్రత కోసం అందరు ఏకమై శ్రమదానం చేయాలని జవాన్లు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, ప్రధానోపాధ్యాయులు మీస రాజమల్లయ్య, మోహన్‌సింగ్, సీఆర్పీఎఫ్ జవాన్ మనోహన్, జవాన్లు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగు పడి పాడిగేదె మృతి



మహాముత్తారం: మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం శుక్రవారం తెల్లవారు జామున పడింది. వర్షంతో పాటు పిడుగుపడటంతో మండలంలోని ఆంజనేయపల్లికి చెందిన కొర్ర సత్యం రైతుకు చెందిన పాడి గేదె మృతి చెందింది. ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని కోరారు.

ఆశ కార్యకర్తల ధర్నా



భూపాలపల్లి అర్బన్: ఆశ వర్కర్లు చేపడుతున్న సమ్మెలో భాగంగా శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా చేపట్టి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, నాయకులు రమేష్, రాజయ్య, లక్ష్మి, రవికుమార్, రాజేందర్, కుమారి, సరిత, సునీత, వినోద, రామ, రజితలు పాల్గొన్నారు.

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5 నుంచి 10వ తరగతి విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారిణి సునిత ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



కాళేశ్వరం: మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా శుక్రవారం గ్రామంలో స్థానిక జమా మసీద్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మసీద్ ప్రెసిడెంట్ ఆమీన్, షకీల్, బాబా, షఫీక్, అస్లం, రయాన్, సమీర్, సమద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, గ్రామాల్లోని మౌళిక సదుపాయాల కల్పనకు పెద్ద పీఠ వేసిందని స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అటవీ గ్రామాలైన రాంపూర్, గొల్లబుద్దారం, దూదేకులపల్లి, పంబాపూర్, నాగారంతో పాటు గిరిజన ఆవాస గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రూ.13.32 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.12.75 లక్షలతో రాంపూర్ నుంచి చికెన్‌పల్లి వరకు బీటీ రోడ్డు, రూ.185 లక్షలతో దూదేకులపల్లి నుంచి దునికేలమడుగు వరకు బీటీరోడుత్తు, రూ.180 లక్షలు, రాజీవ్ నగర్ నుంచి పంబాపూర్ వరకు బీటీ రోడ్డు, రూ.360 లక్షలు, నాగారం నుంచి కిష్టాపూర్ వరకు బీటీ రోడ్డు రూ.189 లక్షలు నాగారం నుంచి మీనాజీపేట వయా గోళ్లబుద్దారం తండా మీదుగా రాజునాయక్ కుంట వరకు బీటీ రోడ్డు, రూ.60 లక్షలతో దీక్షకుంట నుంచి పంబాపూర్ వరకు బీటీ రోడ్డు, రూ.10 లక్షలతో గొల్లబుద్దారంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.



గొల్లబుద్దారంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

రూ.8.5 లక్షలతో పంబాపూర్‌లో గ్రామ పంచాయతీ అదనపు గదిని ప్రారంభించారు. నాగారంలో ఏర్పాటు చేసుకున్న పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. నాగారం ప్రాథమిక పాఠశాలలో రూ.7 లక్షలతో డిజిటల్ తరగతుల గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గడిచిన 9 ఏళ్లలో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్ అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. ప్రత్యేకమైన దృష్టితో భూపాలపల్లి రూరల్ గ్రామాలకు అధిక నిధులు మంజూరు చేశామన్నారు. ఏళ్ల సమస్యగా ఉన్న పోడు భూమి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సేవలను గుర్తించి ఆశీర్వదించండి

● మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



పలిమెల : పాదయాత్ర చేస్తున్న పుట్ట మధు



మహాముత్తారం : సాక్షి పేపర్ చదువుతున్న మధు

పలిమెల : నా సేవలను గుర్తించి నన్ను ఆశీర్వదించాలని మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. కొద్ది రోజులుగా ఆయన చేస్తున్న ప్రజా ఆశీర్వాదయాత్ర శుక్రవారం మండలానికి చేరుకుంది . ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మధు మాట్లాడుతూ నేను ఎమ్మెల్యేగా ఎన్నిక కాకముందు ఈ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉండటంతో 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక నూతన మండలంగా ఏర్పాటు చేశానన్నారు. రోడ్లు, వంతెనల నిర్మాణాలు చేపట్టి ఈ ప్రాంత ప్రజలకు అనేక సేవలు చేశానని గుర్తుచేశారు. అనంతరం మండలంలోని ముకునూరు, పలిమెల గ్రామాల్లోని పలువురు కాంగ్రెస్ నాయకులు మధు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, యూత్ అధ్యక్షుడు రవీందర్, భూపాలపల్లి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, సర్పంచ్‌లు పుష్పలత, సత్యనారాయణ, చుక్కమ్మ, సమ్మక్క, రమాదేవి, నాగయ్య, కాళేశ్వరం దేవాలయం చైర్మన్ శ్రీనివాస్‌రావు, కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ మనోహర్, ప్యాక్స్ చైర్మన్ తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆశీర్వాద పాదయాత్ర

మహాముత్తారం: గత మూడు రోజులుగా మండలంలో పుట్ట మధు చేపట్టిన ఆశీర్వాద పాదయాత్ర గురువారం రాత్రి కనుకునూర్‌కు చేరుకుంది. అక్కడ బస చేసిన ఆయన శుక్రవారం ఉదయం గ్రామంలో ప్రారంభించి కనుకునూర్, కొత్తపల్లే, రెడ్డిపల్లి గ్రామాల్లో కొనసాగింది. ఆయా గ్రామాల్లోని ప్రజలకు వచ్చే ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించి అసెంబ్లికి పంపాలని కోరారు. ఆయన వెంట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి

చిట్యాల: గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, సీడీపీఓ అవంతి, సర్పంచ్ ముకిరాల మధువంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని జడల్‌పేట శివారు భీష్మనగర్, ఏలేటి రామయ్యపల్లి, చింతకుంట రామయ్యపల్లి గ్రామాల్లో పోషణమాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గర్భిణులు ప్రతి రోజు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇచ్చే ప్రతీది సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే వ్యక్తగత, పరిసరాల పరిశుభ్రత, మంచినీరు, ప్రాముఖ్యతమైన చిరుధాన్యాలతో కూడిన వంటకాలు ప్రతి రోజు భుజించాలని పేర్కొన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం నేర్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, ఆయా గ్రామాల అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.



చిట్యాల : సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ



కాటారం: సీమంతం జరిపిస్తున్న సీడీపీఓ

పోషక విలువల ఆహారం తీసుకోవాలి

కాటారం: గర్భిణులు, బాలింతలు, బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక సూచించారు. మండలంలోని అంకుషాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. పోషక విలువలతో కూడిన ఆహారపదార్థాలను తయారు చేసి ప్రదర్శన ఇచ్చారు. ముగ్గురు గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ ఆహార పదార్థాల స్వీకరణలో మార్పులు తెచ్చుకోవాలని తెలిపారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారపదార్థాలు తీసుకోవాలని, పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ టీచర్లు షహేదాబేగం, శ్రీలత, హైమావతి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కాటారం: తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న పథకాలు, సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని పెద్దపల్లి డివిజన్ తపాలాశాఖ అధికారి సయ్యద్ అజహరొద్దీన్ అన్నారు. మండలంలోని గంగారంలో శుక్రవారం ఆ శాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(డీసీడీపీ)ను నిర్వహించారు. తపాలా శాఖ ద్వారా అమల్లో ఉన్న వివిధ పథకాల గూర్చి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుకన్య సంవృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్, టాటాపాలసీ, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి, బీమా యోజన లాంటి బృహత్తర పథకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. శాఖలో ప్రజలకు లబ్ధి చేకూర్చే ఎన్నో పథకాలు ఉన్నాయని వివరించారు. తపాలశాఖ సేవలు భారతదేశం అంతటా వ్యాపించాయన్నారు. గ్రామాల్లో నూతన ఖాతాలను ఓపెన్ చేశారు. కార్యక్రమంలో తపాలాశాఖ ఎంఓ రాజు, గంగారం బీపీఎం కుడుదుల కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజహరొద్దీన్

కళాకారులకు డప్పుల పంపిణీ

భూపాలపల్లి రూరల్ : మండలంలోని గుర్రంపేట గ్రామ డప్పు కళాకారులకు గ్రామానికి చెందిన కొర్ర సమ్మయ్య, సీతానాయక్‌లు డప్పులతో పాటు దోతులు, చున్నీలు, బనియన్లు, గజ్జెలు పంపిణీ చేశారు. దాతలకు డప్పు కళాకారుల బృందం అధ్యక్షులు జెరుపోతుల భిక్షపతి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల బృందం సభ్యులు దూడపాక సదానందం, వేణు, శంకర్, నరేష్ , విజయ్‌కుమార్, మరాటి మధు, విక్రమ్, భాస్కర్, గాజుల కుమార్, రమేష్, రవి, నరేష్, శ్రీను, శంకర్, సురేష్, శనిగరం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారులకు డప్పులు పంపిణీ చేస్తున్న దాతలు సమ్మయ్య, సీతానాయక్

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మల్హర్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాడిచర్ల సెంటర్‌లో బ్యాంక్ అందిస్తున్న సేవలపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుపంట రుణాలు, గోల్డ్ లోన్‌లు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ లైఫ్, పీఎం జేజేబీవై, పీఎం ఎస్‌బీఐ, ఏపీవై, ఎస్‌బీఐ జనరల్ వంటి ఇన్సూరెన్స్ తప్పకుండా చేసుకోవాలని సూచించారు. అలాగే డిజిటల్ లావాదేవీల కోసం మొబైల్ బ్యాంకింగ్ గురించి అవగాహన కల్పించారు. నగదురహిత లావాదేవీలు సైబర్ మోసాలపై కళాజాత సభ్యులు పాటలు, మ్యాజిక్ షో ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కాటారం: మద్యం మత్తులో పురుగులమందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన సంఘటన మండలంలోని ఇబ్రహీంపల్లి పరిధిలోని సుబ్బయ్యపల్లిలో చోటు చేసుకొంది. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహాదేవపూర్‌కు చెందిన రౌతు తిరుపతి(26) సుబ్బయ్యపల్లిలో తన తల్లి వసంతతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 25న పొద్దంతా పనికి వెళ్లిన తిరుపతి సాయంత్రం ఫూట్‌గా తాగివచ్చాడు. దీంతో తల్లి వసంత మందలించగా క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి చుట్టుపక్కల వారి సహాయంతో చికిత్స నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమంగా మారడంతో వైద్యులు వరంగల్‌కు రెఫర్ చేశారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ తిరుపతి గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

భూపాలపల్లి అర్బన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా చైర్మన్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో శుక్రవారం డీఈఓ రాంకుమార్ అధ్యక్షతన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఒలింపిక్ జెండాను డీఈఓ రాంకుమార్ ఎగురవేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించటానికి తెలంగాణ ప్రభుత్వం చాలా కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని చెప్పారు. అప్పుడే సంపూర్ణ వికాసం పొందుతారన్నారు. క్రీడాకారులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో కూడా తగిన ప్రాధాన్యతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని చెప్పారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే, తప్పకుండా విజయం సాధిస్తారన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ కోసం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చాలా సహకరించారన్నారు. ముఖ్యంగా గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, మెమొంటోలను కూడా జీఎంఆర్ ట్రస్టు ద్వారానే అందజేసినట్లు తెలిపారు.



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మూడు సంవత్సరాలుగా నిలిచిపోయిన ఎస్‌జీఎఫ్ క్రీడలను ఈ ఏడాది నిర్వహించుకోవడం చాలా సంతోషమన్నారు. మట్టిలో మాణిక్యాలు అన్నట్లుగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాలన్నారు. ఈ ఆటల పోటీలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ముఖ్యంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న పీడీలు, పీఈటీలు విద్యార్థులకు వివిధ క్రీడా నైపుణ్యాన్ని పెంచేవిధంగా కృషిచేయాలని కోరారు. బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు చాలా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అధికారి బుర్ర సునీత, మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, ఎంఈఓ దేవానాయక్, ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్, పీడీ రాజయ్య, పీఈటీలు జయపాల్, రాజయ్య, సాంబమూర్తి, సురేష్, ప్రసాద్, లింగయ్య పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ పాఠశాలను జిల్లా అసిస్టెంట్ ఉమాశంకర్ ప్రసాద్ శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ విద్యార్థుల హాజరుశాతాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసకున్నారు. గ్రామ పరిధిలోని పాఠశాల, బాలిక హాస్టల్‌లో నెలకొన్న విద్యుత్, వాటర్, ప్లంబింగ్, కోతుల బెడద తదితర సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కోతుల బెడద నివారణకు జాలి ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహామూర్తి, పీఆర్ఏఈ అశోక్, సర్పంచ్ స్వరూప బాపు, తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న అసిసెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కర్ర వానిగూంపు గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రెండో విడత దోమల మందు స్ప్రెయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ సమ్మయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్క ఇంటిలో దోమలమందు స్ప్రెయింగ్ చేయించుకోవాలని సూచించారు. ప్రజలు జ్వరాల బారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో పోటీలు

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎస్‌సీఈఆర్‌టీ ఆదేశాలను జిల్లాలో నవంబర్ మొదటి వారంలో జాతీయ బాలల సైన్స్ దినోత్సవ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి తెలిపారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో బయోలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ టీచర్లకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌పై ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని, సృజనాత్మకతను, సైన్స్ దృక్పథాన్ని వెలికితీసేందుకు సైన్స్ కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. స్థానిక సమస్యలను తీసుకొని ఆ సమస్యలకు పరిష్కార మార్గాలను ప్రయోగాత్మకంగా, పరిశోధనాత్మకంగా పరిష్కరించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. జిల్లాస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు నవంబర్ మొదటి వారంలో జరుగుతాయన్నారు. లక్ష్మణ్, కోఆర్డినేటర్ కుమారస్వామి, డీఆర్‌పీ భజననాయక్ పాల్గొన్నారు.

అడ్డుకుంటున్న అధికార పార్టీ

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాలు అడ్డుకుంటున్నాయని బీఎంఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు అ ప్పాని శ్రీనివాస్ ఆరోపించారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియాలోని కేటీకే 6వ గనిలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. సింగరేణిలో అధికార పార్టీ రాజకీయ జోక్యంతో సంస్థను అమ్మడానికి సిద్ధంగా ఉందన్నారు. చేతగాని యాజమాన్యం వల్ల కార్మికుల ఓట్లతో గెలిచిన యూనియన్ పైరవీలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. టీబీజీకేఎస్‌తో సింగరేణిలో కార్మికుల ఆత్మగౌరవం దెబ్బతిందన్నారు. స్వరాష్ట్ర పాలనలో సింగరేణి నష్టాల్లోకి పోవడం బాధాకరమన్నారు. కార్మికుల ఓట్ల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై పడుతుందనే గుర్తింపు సంఘం ఎన్నికలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యంతో కలిసి కుట్రచేస్తుందని ఆరోపించారు. సుజేందర్, మల్లేష్, నర్సింగరావు, మల్లేష్, సంపత్, రాజేందర్, జనార్దన్, ఫిట్ కార్యదర్శులు కార్తీక్, యూసఫ్ పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు మాట్లాడుతూ.. అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనం అమలు చేయాలన్నారు. జీఓ నంబర్ 22ను గెజిట్ చేసి అమలు చేయాలని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అప్పటివరకు కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. కోల్ ఇండియాలో మాదిరిగా ప్రమాదవశాత్తు చనిపోయిన కాంట్రాక్టు కార్మికులకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, లాభాల్లో వాటా 20శాతం, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, నాయకులు కంపేటి రాజయ్య, మడికొండ సుధాకర్, లక్ష్మి, స్వామి, తిరుపతి కల్యాణి, సంపత్‌రెడ్డి, శ్రీను, శంకర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నూ గూరు, మొర్రవానిగూడెం, రంగరాజాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిభిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారి నుంచి రక్త నమూనాలను సేకరించి మందులను పంపిణీ చేశా రు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు